‘చేపమందు’ పంపిణీకి పూర్తి సహకారం

అగర్వాల్ సమాజ్ అధ్యక్షుడు మనీష్ అగర్వాల్



బత్తిని సోదరులను సన్మానిస్తున్న అగర్వాల్ సమాజ్ ప్రతినిధులు

రాంగోపాల్‌పేట్: ఈ నెల 8న వ తేదీన నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో బత్తిని కుటుంబ సభ్యులు పంపిణీ చేసే చేప మందు కార్యక్రమానికి పూర్తి సహాయ సహకారం అందిస్తామని అగర్వాల్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు మనీష్ అగర్వాల్ అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ ప్యారడైజ్ ప్రాంతంలోని అగర్వాల్ సమాజ్ హాల్లో అగర్వాల్ సమాజ్ వార్షిక సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చేప మందు స్వీకరించేందుకు వచ్చే ప్రజలకు రెండ్రోజుల పాటు భోజన సదుపాయాలు కల్పించనున్నట్లు ప్రకటించారు. సమాజ్‌కు చెందిన 85 శాఖల నుంచి 400 మంది వలంటీర్లు ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూస్తారని దేశం నలుమూలల నుంచి వచ్చే ప్రజలకు రైల్వే, బస్ స్టేషన్ల నుంచి పికప్, డ్రాప్ సౌకర్యాలను కూడా కల్పిస్తున్నామన్నారు. సమాజ్ గౌరవ కార్యదర్శి కపూర్ చంద్ గుప్తా సమాజ్ గత ఏడాది కాలంగా నిర్వహించిన సేవా కార్యక్రమాల గురించి వివరించారు. కోశాధికారి నవీన్ అగర్వాల్ సమాజ్ ఆర్థిక లావాదేవీలను సభ్యులకు తెలిపారు. ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచాలనే ఉద్దేశంతో ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో డ్రా ద్వారా 6 మందిని ఎన్నుకుని పది గ్రాముల వెండి డాలర్‌లను బహుమతిగా ఇచ్చి సత్కరించారు. ఈ సమావేశంలో పాల్గొన్న బత్తిని సోదరులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పురుషోత్తం అగర్వాల్, ప్రతినిధులు కంచన్ అగర్వాల్, అంజనీకుమార్ అగర్వాల్, రాకేష్ అగర్వాల్, అజయ్‌కుమార్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరిలో సహాయం చేసే గుణం ఉండాలి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట: సాటి వారికి అవసరమైన సహాయాన్ని అందించినప్పుడే మానవ జీవితానికి సార్థకత లభిస్తోందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్‌లోని బీకేగూడ పార్కు వద్ద శ్రీనివాస సమాజ సేవా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 50 రోజులుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆకలితో అలమటిస్తున్న వారి ఆకలి తీర్చాలనే సంకల్పంతో 2011 నుంచి సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో చేస్తున్న అన్నదాన కార్యక్రమానికి పలువురు దాతలు సైతం సహకారం అందిస్తున్నారన్నారు. సమాజంలోని పేదలకు మేలు చేయాలనే ఉద్దేశంతో వయస్సును కూడా లెక్క చేయకుండా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతుండటం అభినందనీయమన్నారు. సీనియర్ సిటిజన్స్ చేపట్టే కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నానని, ఇక ముందుకు కూడా అదే విధంగా అందిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నామన శేషుకుమారి, కొలను బాల్‌రెడ్డి, ట్రస్టు ఎండీ పార్థసారధి, సీనియర్ సిటిజన్స్ మాణిక్‌రావు ఠాగూర్, సహదేవ్‌గౌడ్,ఆర్.సి.కుమార్ పాల్గొన్నారు.

జనరల్ బాడీ సమావేశంలో పలు అంశాలపై తీర్మానం



సమావేశంలో పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు

సనత్‌నగర్: డివిజన్ పరిధిలోని రవీందర్‌నగర్ కాలనీ జనరల్ బాడీ సమావేశం ఆదివారం జరిగింది. కాలనీ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన ఈ సమావేశంలో అసోసియేషన్ సభ్యులు హాజరై పలు తీర్మానాలు చేశారు. ముఖ్యంగా కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు నిర్మాణం, చైన్ ఫెన్సింగ్, సీవరేజ్ లైన్ నిర్మాణాలతో పాటు పెండింగ్ పనులైన రోడ్లు, ఫుట్‌పాత్ నిర్మాణాలను పూర్తి చేసేవిధంగా చొరవ తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌సింగ్, సెక్రటరీ భీమ దేవమణి, ఉపాధ్యక్షులు ఎన్వీ రమణారెడ్డి, ఎస్.సుదర్శన్, కోశాధికారి రాంరెడ్డి, అడ్వైజర్ కమిటీ సభ్యులు ఆర్.సత్యనారాయణ, సూర్యనారాయణ, సాంబశివరావు, రామిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కేకే మాథ్యూర్ పాల్గొన్నారు.

యువత ఆధ్యాత్మికత వైపు అడుగులు వేయాలి



వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆకుల రవీందర్‌రావు

కాచిగూడ: యువత ఆధ్యాత్మికత వైపు అడుగులు వేసి ధార్మిక భావాలను పెంపొందించుకోవాలని ప్రముఖ సామాజికవేత్త లయన్ ఆకుల రవీందర్‌రావు అన్నారు. బాల భారతి శిక్షణ సమితి అధ్యక్షుడు కుంట రామకృష్ణ ఆధ్వర్యంలో చిన్నారులకు నెలరోజుల పాటు వేదిక్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు భగవద్గీత శ్లోకాలు, యోగా, మెడిటేషన్, ప్రాణాయామ, సనాతనధర్మం తదితర అంశాల్లో శిక్షణ తరగతులను నిర్వహించారు. ఆదివారం ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన వేదిక్ క్యాంపు ముగింపు సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో ధార్మిక భావనలు పెంపొందించేందుకు బాల భారతి శిక్షణ సమితి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. యువత పాశ్చాత్య పోకడలకు బానిసలు కాకుండా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పిల్లలకు చిన్నతనం నుంచే అలవాటు చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. దైవచింతన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకునేందుకు ఎంతగానో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పిల్లల సాంస్కృతిక ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. భగవద్గీత టీచర్ రేఖ, యోగా టీచర్ ప్రభావతి, నిర్వాహకులు వీరేష్‌గౌడ్, మధు, రామమూర్తి, భార్గవ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాయం చేస్తానని నమ్మించి బ్యాగుతో పరారీ

బ్యాగును తిరిగి అప్పగించిన సైఫాబాద్ ట్రాఫిక్ పోలీసులు

తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాల్లో స్టాల్ ఏర్పాటు చేసేందుకు కరీంనగర్ నుంచి వచ్చిన మహిళ



బ్యాగును అప్పగిస్తున్న సైఫాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, కానిస్టేబుల్ సాయి కిరణ్



బ్యాగులో మిల్లెట్ ఉత్పత్తులు

ఖైరతాబాద్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై ఫుడ్ స్టాల్ ఏర్పాటుచేసేందుకు కరీంనగర్‌కు చెందిన స్వరూప శనివారం సాయంత్రం తమ మిల్లెట్ ఉత్పత్తులతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో దిగి అక్కడినుంచి ఆటోలో ట్యాంక్ బండ్‌కు వరకు వచ్చింది. అక్కడ రోడ్డు మూసివేయడంతో మరో మహిళతో కలిసి తమ ఉత్పత్తుల బ్యాగును తీసుకుని వెళ్తుండగా అదే సమయంలో సైకిల్‌పై వచ్చిన ఓ బాలుడు ఆంటీ మీ బ్యాగు నా సైకిల్‌పై పెట్టండి నేను మీ స్టాల్ వరకు తెస్తా అని చెప్పాడు. వారు వద్దని వారించినా వినకుండా ఇవాళ నేను ఇదే పని చేస్తున్నా ధైర్యంగా మీ బ్యాగు పెట్టండి అని చెప్పడంతో వారు ఆ బ్యాగును సైకిల్ వెనుక భాగంలో పెట్టి కట్టారు. కొద్ది దూరం వెళ్లిన తర్వాత వారిలో ఓ మహిళ నీళ్లు తాగేందుకు పక్కకు వెళ్లడంతో స్వరూపను కూడా సదరు కుర్రాడు మీరు కూడా నీళ్లు తాగండి అని చెప్పాడు. సైకిల్ స్టేజీ దాటి ముందుకు వెళ్లగానే వారి కళ్లు గప్పి బ్యాగ్‌తో ఉడాయించాడు. తాము మోసపోయినట్లు తెలుసుకున్న బాధితులు బ్యాగ్‌పై ఆశలు వదులుకున్నారు. ఆదివారం ఉదయం ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో బందోబస్తులో ఉన్న సైఫాబాద్ ట్రాఫిక్ కానిస్టేబుల్ సాయికిరణ్ ఎన్టీఆర్ ఘాట్ సమీపంలోని ఫుట్ ఓవర్ బ్రిడ్జి వద్ద బ్యాగు పడి ఉండటాన్ని గుర్తించి చెక్ చేయగా అందులో మిల్లెట్ ఉత్పత్తులతో పాటు స్వీట్లు, పచ్చళ్లు ఉన్నట్లు గుర్తించాడు. ఉత్పత్తులపై ఉన్న నెంబర్‌కు ఫోన్ చేయగా కరీంనగర్ అడ్రస్‌లో ఉన్నవారు ఫోన్ లిఫ్ట్ చేశారు. తమకు బ్యాగు దొరికిందని, మీ వాళ్లు ఎవరైనా హైదరాబాద్‌కు వచ్చారా అని ఆరా తీయగా ట్యాంక్‌బండ్‌పై స్టాల్ పెట్టుకునేందుకు వచ్చిన స్వరూప నెంబర్ ఇవ్వడంతో ఆమెకు ఫోన్ చేశారు. సైఫాబాద్ ట్రాఫిక్ పోలీసులు ఇచ్చిన సమాచారంతో ఆదివారం ఆమెకు బ్యాగును అప్పగించారు. బ్యాగులో కొన్ని స్వీట్లు, లడ్డూలు తీసుకొని మిగతా ఉత్పత్తులను వదిలేసి వెళ్లినట్లు ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపారు. సీసీ కెమెరాలో పరిశీలించగా సైకిల్‌పై బ్యాగుతో కుర్రాడు వెళ్తున్న దృశ్యాలను పోలీసులు గుర్తించారు.



టీజీపీసీబీలో జాతీయ జెండా ఎగురవేస్తున్న చీఫ్ ఇంజనీర్ రఘు



బోనాలతో పీసీబీ మహిళా ఉద్యోగులు

పదేళ్ల పండగ.. తెలంగాణ మది నిండుగ

తెలంగాణ రాష్ట్ర దశాబ్ది వేడుకలను ఆదివారం సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్లలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. వివిధ ప్రాంతాల్లో జరిగిన అవతరణ వేడుకల్లో రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని అమర వీరులకు నివాళులర్పించి వారి త్యాగాలను స్మరించుకున్నారు. వివిధ ప్రాంతాల్లో భారీ ర్యాలీలు నిర్వహించి జై తెలంగాణ నినాదాలతో హోరెత్తించారు.

–సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం



బేగంపేటలో జాతీయ జెండా ఎగురవేసిన కార్పొరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి



అమీర్‌పేటలో జరిగిన వేడుకల్లో బీఆర్‌ఎస్ నాయకులు



జాతీయ పతాకాన్ని ఎగురవేసిన రవీంద్రభారతి పాఠశాల సిబ్బంది



ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట జాతీయ పతాకానికి వందనం చేస్తున్న ఇన్‌చార్జి వీసీ దానకిషోర్



తార్నాక చౌరస్తాలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న బీజేపీ నాయకులు



కాంగ్రెస్ నాయకుడు నాగులూరి సాయిబాబా ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలు



చిలకలగూడ యూపీహెచ్‌సీ సిబ్బంది నేతృత్వంలో..



సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో జరిగిన వేడుకల్లో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ రాజారావు



ఆర్ట్స్ కళాశాల ఎదుట కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న విద్యార్థి నేతలు

రెండ్రోజుల ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

కాచిగూడ: ఈనెల 3,4 తేదీల్లో కాచిగూడ, లింగంపల్లి రాఘవేంద్రస్వామి దేవస్థానం ఎదురుగా ఉన్న న్యూ లైఫ్ ఆయుర్వేదిక్ ఆయిల్ థెరఫీ సెంటర్‌లో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు శ్రీనివాస్‌గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా ఉచిత వైద్యంతో పాటు ఆయుర్వేదంపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన తెలిపారు. వివరాలకు 8247553984, 7993856327.

కమనీయం..శ్రీనివాస కల్యాణం

కాచిగూడ: సనాతన ధర్మ పరిరక్షణలో భాగంగా వాసవీ క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీనివాస కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం విష్వక్సేన, కుబేర, ధన్వంతరి, సహిత లక్ష్మీ నారసింహ సుదర్శన హోమాన్ని జరిపించారు. కృష్ణమోహన్ గుప్త, రమేష్, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

ఒడిశా టూ హైదరాబాద్

గంజాయి తరలిస్తున్న వ్యక్తి రిమాండ్

రాంగోపాల్‌పేట: ఒడిశా నుంచి రైలులో గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసిన ఘటన మార్కెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ రాఘవేందర్ వివరాల ప్రకారం.. ఒడిశా గజపతి జిల్లాకు చెందిన కురుష్ పైకా (31) నగరానికి వలసొచ్చి కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. స్థానికంగా పరిచయమైన ఓ వ్యక్తి గంజాయి అక్రమ రవాణా చేయాలని సూచించాడు. అంగీకరించిన కురుష్ పైకా సదరు వ్యక్తి అప్పగించిన గంజాయితో ఆదివారం మధ్యాహ్నం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. రైల్వేస్టేషన్ నుంచి బయటకు వచ్చి సమీప లాడ్జీలో ఉన్న వ్యక్తికి గంజాయి అప్పగించేందుకు వెళ్తుండగా అనుమానం వచ్చిన పోలీసులు అతని బ్యాగును తనిఖీ చేయగా 22 కిలోల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకుని కురుష్‌పైకాను రిమాండ్‌కు తరలించామన్నాని, ప్రధాన నిందితుడిని గాలిస్తున్నామని సీఐ రాఘవేందర్ తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ : రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. రైల్వేహెడ్ కానిస్టేబుల్ ఎం.చిమ్నా తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి (35) శివరాంపల్లి – బుద్వేల్ రైల్వేస్టేషన్ల మధ్య రైలు పట్టాలు దాటుతుండగా.. రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మైలార్‌గడ్డ వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



మూలమలుపు వద్ద స్తంభాన్ని ఢీకొట్టిన కారు(ఫైల్)

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ చిలకలగూడ ప్రధాన రహదారి మైలార్‌గడ్డ మూలమలుపు వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. మూలమలుపు వద్ద వాహనాలు అదుపు తప్పి వద్ద తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా స్పందించలేదని బీజేపీ సీనియర్ నాయకుడు ప్రభుగుప్తా ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని, లేకుంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

మర్రి శశిధర్‌రెడ్డికి సన్మానం



సనత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర తొలి ఉద్యమకారుడిగా సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్ రెడ్డి సత్కారాన్ని అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయనను ఎంపీ లక్ష్మణ్ సన్మానించారు. 1969 తెలంగాణ తొలి ఉద్యమ సమయంలో అరెస్టు అయ్యి ఆరు రోజుల పాటు ముషీరాబాద్ జైలులో మర్రి శశిధర్‌రెడ్డి శిక్ష అనుభవించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

కేసీఆర్ కృషితోనే తెలంగాణ ఏర్పాటు

ముషీరాబాద్: కేసీఆర్ పోరాటంతోనే తెలంగాణ కల సాకారమైందని బీఆర్‌ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు అన్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ముషీరాబాద్, భోలక్‌పూర్ డివిజన్‌లలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను నిర్వహించారు. ముషీరాబాద్‌లోని రెయిన్‌బో హోం అనాథాశ్రమంలో బీఆర్‌ఎస్ ముషీరాబాద్ డివిజన్ మాజీ అధ్యక్షులు అజయ్‌ముదిరాజ్, ఉపాధ్యక్షులు లక్ష్మణ్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లా డుతూ అమరుల త్యాగాల ఫలితంగా అవిర్భావించిన తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ అన్ని విధాల అభివృద్ధి చేశారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్ష, కార్యదర్శులు సదా, సంతోష్, డివిజన్ ఉపాధ్యక్షులు బాలరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక వేడుకలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విద్యాసంస్థల కార్యదర్శి గడ్డం వినోద్‌కుమార్ జాతీయ జెండాను ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో ఆకాంక్షించిన ప్రయోజనాలు నెరవేరాలన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి అందరు తమవంతుగా సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.27, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 17, క్యారెట్ 40, దొండ 18, గుండుబీన్స్ 105, గింజ బీక్కుడు 75, గోకరకాయ 45, కీర 23, దోసకాయ 23, రూట్ రూట్ 19, ఉల్లిగడ్డ 26, ఆలుగడ్డ 31, చామగడ్డ 40, మొరంగడ్డ 28, కందగడ్డ 65, సొరకాయ 11, పొట్లకాయ 15, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

ఉచిత వైద్య శిబిరం

నల్లకుంట : తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. శిబిరంలో వందలాది మంది వృద్ధులకు వైద్య చికిత్సలు అందించి మందులు అందజేశారు. శిబిరంలో చికిత్సలు పొందిన వారికి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వివేక్ ఆధ్వర్యంలో ఉచితంగా అల్పాహారం పంపిణీ చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా చైర్మన్ మామిడి భీమ్‌రెడ్డి, మీడియా కన్వీనర్ ఎం.ఐజాక్‌రాజ్, దీపిక రియాజ్ దిన్, వివిధ శాఖలకు చెందిన వైద్యులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తెలంగాణ సాధనకు మరో ఉద్యమం

కాచిగూడ: సామాజిక తెలంగాణ సాధన కోసం బీసీ సంక్షే సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో మరో ఉద్యమం చేపట్టనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం తెలిపారు. ఆదివారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ పోరాటంతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. అయి తే ప్రత్యేక రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, సబ్బండ వర్గాలకు న్యాయం జరగడం లేదన్నారు. సబ్బండ వర్గాల పోరాటం, త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. కష్టనష్టాలకు ఓర్చుకుని పోరాటంలో ముందుండి ఉద్యమాన్ని నడిపించారని, సాధించుకున్న తెలంగాణలో మాత్రం బీసీలకు జనాభా ప్రాతిపదికన వాటా దక్కడం లేదన్నా రు. అగ్రవర్ణాల చేతిలో తెలంగాణ బందీగా మారిందని, బీసీల పట్ల ఇంకా వివక్ష కొనసాగుతూనే ఉందన్నారు. సామాజిక తెలంగాణతోనే అందరికీ సమ న్యాయం జరుగుతుందన్నారు.